# తుడ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**-సిఎంచంద్రబాబు హామీ**



తిరుపతికార్పొరేషన్, జూలై 20ప్రభాతవార్త

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి పూర్తిసహాయసహకారాలందిస్తానని తెలిపారని తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతి పర్యటనలో సిఎంతో కలసిన తుడ ఛైర్మన్ పలు అంశాలపై ప్రతిపాదనలు నివేదించారు. తుడ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు తీసుకురానున్న ప్రాజెక్టులు,గ్రామాలలో చేపడుతున్న మౌళిక వసతులు తుడ ఛైర్మన్ సిఎంకు వివరించారు. తుడ అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం సంపూర్ణ సహకారాలంస్తుందని సిఎం హామీ ఇచ్చారన్నారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# మిథున్ రెడ్డి అరెస్ట్‌పై నిరసన



పుత్తూరు, జూలై 20 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రంలో అక్రమ అరెస్ట్‌లు జరుగుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజా, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. మద్యం కేసులో పార్టీ ఎంపి మిథున్ రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం పుత్తూరు బైపాస్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి వీరు నిరసన వ్యక్తం చేశారు. తొలుత వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని దాని ప్రకారం ఎటువంటి ఆధారాలు లేకుండా తమ పార్టీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో

# మహిళలకు అధిక ప్రాధాన్యత

**మంత్రి గుమ్మడి సంధ్యారాణి**



నాయుడుపేట జూన్ 20 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంలో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర గిరిజన, శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా నాయుడుపేట పట్టణం లోని ఏఎంసి కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. తల్లిని,చెల్లిని పట్టించుకోని నాయకుడు తల్లికి వందనం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. మద్యం కుంభకోణంలో వైసిపి మాజీమంత్రులు వరుసగా జైలుకుపొవడం ఖాయమన్నారు. ఏరాష్ట్రంలో ఇవ్వని విధంగా మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా కింద పెన్షన్లు నాలుగువేలుకు పెంచి ఇవ్వడం జరుగుతుందన్నారు.యువగళంలో లోకేష్‌బాబు ఇచ్చిన మాటప్రకారం ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలచేసి నిరుద్యోగ యువతి,యువకులకు పదహారువేల ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామని తెలియజేశారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సుసౌకర్యం, అన్నదాత సుఖీభవ ప్రారంభించడం జరుగుతుందన్నారు. త్వరలో కరెంటుబిల్లులు స్వల్పంగా తగ్గించి ప్రజలకు విధ్యుత్ భారంను తగ్గించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరు కలిసికట్టుగా పనిచేసి వందశాతం ఫలితాలు సాధించాలన్నారు.రాష్ట్రంలో వైసిపి నాయకులు మహిళలపట్ల చులకనగా మాట్లడుతున్నారని, వారు పద్ధతి మార్చుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ కేంద్రమంత్రి పనబాకలక్ష్మి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# హరోంహర

**దక్షిణ కైలాసం అంతా పసుపు మయం**

**ఘనంగా ఆడికృత్తిక సంబరాలు**

**కడలితరంగాల్లా కదలి వచ్చిన భక్తజనం**

**చక్కటి ఏర్పాట్లు: ఇఒ పర్యవేక్షణ**





శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త

దక్షిణకైలాసం ఆధ్యాత్మికతకు నిలయం. నెల నెలా ఓ ఉత్సవం భక్తుల సంబరం. సాధారణంగా ఈ దివ్యక్షేత్రంలో ఆది నుంచి ఏ ఉత్సవం అయినా రాత్రి ఘడియలున్నపుడు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఆదివారం ఆడికృత్తికను నిర్వహించారు. ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఉత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయంలోని అందరు సిబ్బందిని కుమారస్వామి కొండపై పర్యవేక్షణకు నియమించారు.

**హరోం హరా మురుగ . . .**

శ్రీకాళహస్తిలోని విజ్ఞాన గిరిపై జరుగుతున్న మురుగన్ బ్రహ్మోత్సవాల్లో ఆడికృత్తిక సందర్భంగా ఆదివారం వేకువ జాము నుంచి కడలి తరంగాల్లా భక్తులు కదలి వచ్చారు. ఆలయాధికారులు అందిన సమాచారం మేరకు సాయంత్రానికి 60వేలకు పైగా భక్తులు దర్శనం చేసుకున్నట్లు సమాచారం.మధ్యాహ్నం నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తరలి వచ్చారు. ఆడిమాసంలో(ఆషాఢం) నిర్వహించే ఉత్సవాలు ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు.ఈ ఉత్సవాల్ని శ్రీకాళహస్తీశ్వరాలయంలో చెంగల్వరాయ స్వామి బ్రహ్మోత్సవాలు గాను, అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయంలో మహోత్సవాలుగా నిర్వహిస్తున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన భోళాశంకరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తుంటే ఆయన తనయుడు కుమారస్వామి తన వద్దకు పరుగున వచ్చే భక్తులకు విజ్ఞానాన్ని ఒసగుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 3గంటల నుంచి ఆలయంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది. స్థానిక భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి మురుగన్ దర్శనం చేసుకున్నారు. మదినిండా భక్తి భావం, భక్తి పారవశ్యంతో భుజంపై కావడి, శుభం జరగాలనే ఆకాంక్షతో పసుపు బట్టలు ధరించిన భక్తులు తరలి వచ్చారు.ఎటు చూసినా కావళ్ళతో 'హరోంహర'అంటూ మొక్కులు తీర్చుకున్నారు. మొక్కులు కల్గిన వారు పంబజోళ్ళ మోతలతో కావళ్ళను తీసుకొని కుమారస్వామి దర్శించుకున్నారు.గతంలో తమిళనాడులోని తిరుత్తణికి ఈ ప్రాంతాల నుంచి వెళ్ళె వారు. కానీ కుమారస్వామి ఆలయాన్ని తీర్చి దిద్దిన తరువాత భక్తులు ఇక్కడే దర్శించుకుంటున్నారు. ెభక్తులు మరో వైపు వారికి సదుపాయాలందించేందుకు స్వచ్చంద సేవా సంస్థల పంపిణిలు, మరోవైపు మజిలి దుకాణాలతో కళ కళ లాడింది.అధికారికంగా అందించిన సమాచారం మేరకు సాయంత్రం 6గంటలకు అందిన సమాచారం మేరకు తలనీలాలు పది వేల మంది. సుమారు 5వేల మంది అర్చనలు, సుమారు 2వేల కావళ్ళను అధికారికంగా జరుపుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా విధులకు కొత్త అయిన ఇఓ డి.బాపిరెడ్డి, ఇద్దరు అధికారులు చక్కగా పర్యవేక్షించి సక్సస్ అయ్యారు. డివైయస్‌పి నరసింహామూర్తి పర్యవేక్షణలో సిఐలు,డి.గోపి, నాగా ర్జున్‌రెడ్డి,తిమ్మయ్య వారి సిబ్బంది నిర్వహించారు. సుమారు 20 మంది హెడ్ కానిస్టేబుల్స్, 70 మంది కానిస్టేబుల్స్ మఫ్టీ పోలీ సులు, మహిళా పోలీసులు చక్కగా బందోబస్తు నిర్వహిం చారు. గతంలో ఏదో ఒక వివాదం చోటు చేసుకునేది ఈ సారి ఎలాంటి విమర్శలు ఆరోపణలు లేకుండా రూపకల్పన చేశారు. చ్చిన భక్తులకు సత్వర దర్శనం,సుదర్శనం ఏర్పాటు చేయటంలో చొరవ చూపారు.

## మయూరవాహనంపై షణ్ముఖుని దివ్యదర్శనం



శ్రీకాళహస్తి, జూలై 20 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆడికృత్తికను పురస్కరించుకుని ఆదివారం రాత్రి కుమారస్వామి మయూరవాహనంపై పురప్రజలకు దర్శనమిచ్చారు. వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఉత్సవమూర్తులను సర్వాంగసుందరంగా ముస్తాబుచేసి బోయిలు మోసుకుంటూ తీసుకువచ్చి ఆలయం వెలుపల ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పసిడి మయూరవాహనంపై ఆశీనుల్ని చేసి పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవం తేరువీధినుంచి నెహ్రూవీధి, బాబుఅగ్రహారం, నగరివీధి, బజారువీధులగుండా సాగింది. స్వామివారిని దర్శనంచేసుకు నేందుకు పలువురు భక్తులు హాజరయ్యారు. హారతులిచ్చి స్వామివారికి మొకు ్కలు తీర్చుకున్నారు. ఉత్సవం ముందు గొడుగులు ముందువెళ్తుం డగా స్వామివారు ఊరేగింపుగా వెళ్తు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాన్ని సకాలంలో నిర్వహించటంలో ఇన్‌చార్జి లక్ష్మయ్య,టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు విజయం సాధించారు. చిన్న ఆలయాల ప ర్యవేక్షకుడు లక్ష్మయ్య పర్యవేక్షణలో ఉత్సవాలు సాగాయి.ఆడికృత్తిక సందర్బంగా రాత్రి ఉత్సవం ఇట్టే భక్తులకు ఆకట్టుకుంది.అలంకారం అదరహో అనిపించింది.

# తవణంపల్లెలో దారుణం

**మాజీ వైస్ ఎంపీపీ హత్య**

**కాళ్ళు, చేతులు బంధించి ఉరివేసిన దుండగులు**



తెల్లగుండ్లపల్లెలో దారుణ హత్యకు గురైన మాజీ వైస్ ఎంపీపీ రంగయ్యనాయుడు

తవణంపల్లె, జూలై 20 ప్రభాతవార్త: మండల మాజీ వైస్ ఎంపీపీ, టీడీపీ నాయకుడు తెల్లగుండ్లపల్లె రంగయ్యనాయుడు శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు రంగయ్యనాయుడు కాళ్ళు చేతులను తాళ్ళతో బంధించి ఇంటి ముందు వున్న ట్రాక్టర్ షెడ్డు వద్ద తాడుతో ఉరివేసి హత్య చేశారు. ఈసంఘటన మండలంలో సంచలనం రేపింది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. గత 15 సంవత్సరాల క్రితం మండల వైస్ ఎంపీపీగా పనిచేసిన తెల్లగుండ్లపల్లె రంగయ్యనాయుడు ప్రస్తుతం స్వగ్రామం తెల్లగుండ్లపల్లెలో భార్యతో కలసి నివాసముంటున్నారు. ఈనేపథ్య ంలో భార్యకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కుమారుడు వద్దకు వెళ్ళింది. దీనితో కుమార్తె, అల్లుడు రంగయ్యనాయుడుకు తోడుగా ఇంటిలో వుంటున్నారు. శనివారం రాత్రి భోజనం అనంతరం కుమార్తె, అల్లుడుతో కలసి రంగయ్యనాయుడు ఇంటబిలో నిద్రించారు. అయితే ఆదివారం వేకువజామున సుమారు 5.45 గంటలకు ఇంటి ముందు ట్రాక్టర్ షెడ్డు వద్ద హత్యకు గురై వేలాడుతుండడాన్ని పలక్క ఇంటివారు గమనించి రంగయ్యనాయుడు కుటుంబసభ్యులకు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు రంగయ్యనాయుడు చేతులు, కాళ్ళను. తాళ్ళతో బందించి తాడుతో ఉరివేసి దారుణంగా హత్య చేసినట్లు గుర్తించి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, రూరల్ వెస్ట్ సిఐ శ్రీధర్ నాయుడులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే చిత్తూరు నుండి పోలీసు జాగిలాలు, క్లూస్ టీం సంఘటనా స్థలంలో వేలిముద్రలను, ఆధారాలను సేకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్‌నాయుడు తెలిపారు ఇదిలా వుండగా గ్రామంలో కొంత మంది యువకులతో జరిగిన చిన్నపాటి గొడవల వల్లే రంగయ్యనాయుడు హత్యకు గురై వుంటారనే కోణంలో పోలీసులు గ్రామానికి చెందిన కొంత మంది యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. వివాదరహితుడు అయిన రంగయ్యనాయుడును ఎవరు? ఎందుకు హత్య చేశారనేవిషయం పోలీసులదర్యాప్తులో తేలాల్సి వుంది.

## మొదటిఘాట్‌లో

# ఎలుగుబంటి హల్‌చల్

తిరుమల,జూలై 20ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమల నుండి తిరుపతికి దిగే మొదటిఘాట్‌లో ఆదివారం రాత్రి 7గంటల ప్రాంతంలో ఎలుగుబంటి సంచారంతో భక్తులు భయపడ్డారు. వినాయకుని గుడి దాటిన తరువాత అటవీప్రాంతంలోనుండి ఎలుగేబంటి ఘాట్‌రోడ్డుపైకి చేరింది. ఆ సమయంలో తిరుపతికి దిగుతున్న వాహనదారులు గమనించారు. వాహనాల లైటింగ్‌కు, శబ్దాలకు ఎలుగుబంటి మళ్ళీ అడవిలోకి వెళ్ళింది. అయితే ఘాట్‌లో ఎలుగుబంటి సంచారంతో ఇప్పుడు భక్తులు కూడా భయపడే పరిస్థితి నెలకొంది. మూడేళ్ళక్రిందట తిరుమలలోనే ఎలుగుబంటి సంచారం ఉండేది.అంతేగాక శ్రీవారిమెట్టుమార్గంలోనూ ఎలుగుబంటి భక్తులకు కనిపించింది. అప్పట్లోనే పట్టివేతకు బోన్లు ఏర్పాటుచేశారు. రెండేళ్ళుగా ఎలుగుబంట్ల సంచారం లేదు. ఆదివారం రాత్రి మళ్ళీ మొదటిఘాట్‌లో ఎలుగుబంటి సంచరించడంతో భక్తుల్లో భయం పట్టుకుంది.



# బోయకొండపై జనమే జనం

**-ఒక్కరోజులోనే రూ.22.44లక్షల ఆదాయం**



బోయకొండ(చౌడేపల్లి), జూలై 20 ప్రభాతవార్త

శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో నిండింది. ఒక్క రోజులోనే వివిధ సేవా టిక్కెట్ల రూపంలో రూ. 22,44,400లు ఆదాయంగా సమకూరిందని ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం తెలిపారు. ఆషాడమాసం ఆఖరు ఆదివారం కావడంతో రాష్ట్రంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి ముఖ్యంగా కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ముడుపులు చెల్లించుకొన్నారు. మదనపల్లి జూనియర్ సివిల్ జడ్జి కీర్తన అమ్మవారిని దర్శించుకొన్నారు. నంద్యాలకు చెందిన ఫారెస్టు రేంజర్ ఆయన సతీమణి ఈశ్వరయ్య, మహేశ్వరమ్మలు గోశాల పథకానికి రూ. 69,200లను విరాళంగా అందించారు. వారిద్దరికీ అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించి, సత్కరించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు, వేదపండితులు అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

# సిఎం మదిలో "బాలాజీరిజర్వాయర్"!





**-టిటిడిలో కదలికే ఇక తరువాయి**

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

దేశవిదేశాల నుండి తిరుమలకు విచ్చేస్తున్న లక్షమంది భక్తులకు తాగునీటి అవసరాలకు "బాలాజీరిజర్వాయర్"ను నిర్మించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించడంతో తెరపైకి ఆ రిజర్వాయర్ నిర్మాణం వచ్చింది. 2014లోనే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం, సిఎం చంద్రబాబునాయుడు బాలాజీరిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని అప్పటి టిటిడి పాలకమండలికి సూచించారు. అదే సంవత్సరం టిటిడి పాలకమండలి ఛైర్మన్‌గా ఉన్నటువంటి చదలవాడ కృష్ణమూర్తి బోర్డులో చర్చించి సుమారు 350కోట్ల రూపాయల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తిరుపతి కరకంబాడి వద్ద ఈ రిజర్వాయర్‌ను3.082 టిఎంసిల నీటిసామర్థ్యంతో నిర్మిస్తే 1టిఎంసి తిరుమల తాగునీటి అవసరాలకు మరో 2 టిఎంసిల నీటిని మల్లెమడుగు ప్రాజెక్టుకు పంపి అటు తాగునీరు ఇటు 55వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే అవకాశం ఉంటుందని సమాచారం.తిరుమలకు లక్షమందికిపైగా భక్తులు చేరినా, 1టిఎంసి నీరు నిల్వఉంటుందని, అవసరమైన సమయంలో పంపింగ్ చేసుకునేందుకు వీలుగా ఉంటుందని ఆలోచన.

రిజర్వాయర్ చేపట్టేందుకు 2018లో కొంతవరకు పనులు మొదలయ్యాయి. 2019లో ప్రభుత్వం మారడంతో ఈ రిజర్వాయర్ పనులు ఎక్కడవి అక్కడే ఆగిపోయాయి. 2021,2022లోనూ ఈ రిజర్వాయర్ చేపట్టాల్సిన అవసరాన్ని అప్పటి టిటిడి పాలకమండలి గుర్తించింది. టిటిడి ,ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు రిజర్వాయర్‌ను పరిశీలించారు. పనులు మొదలవుతాయని అంతా భావించారు..అయితే ఆదిశగా ఇప్పటికీ పనులు సాగలేదు. దానికితగ్గట్లు టిటిడి గత పాలకమండళ్ళ పెద్దలు, అధికారులు కూడా అవసరమైన బడ్జెట్‌లో కేటాయింపులు ఊసే ఎత్తలేదు. గత ఐదారు సంవత్సరాలుగా దేవదేవుని కరుణాకటాక్షాలతో పుష్కలంగా వర్షాలు కురిసి తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలకు వరదనీరు చేరి నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో ఏడాదివరకు తాగునీటి సమస్య ఎదురుకాదనే ధైర్యంతో టిటిడి ఉంది. ఈ నేపథ్యంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి టిటిడి ప్రతిపాదించిన బాలాజీరిజర్వాయర్ పేరును శనివారం తిరుపతి పర్యటనలో సిఎం చంద్రబాబునాయుడు మళ్ళీ ప్రకటనతో ఆశలు చిగురిస్తున్నాయి. సొంత జిల్లావాసులకు తాగు,సాగునీరు సమస్య లేకుండా ప్రాజెక్టులు పూర్తిచేసి రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. తిరుమల పుణ్యక్షేత్రానికి శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి "బాలాజీ రిజర్వాయర్" రావాల్సిన అవసరం ఉందని మరోసారి సిఎం మాటల్లో ప్రస్ఫుటమైంది. ప్రస్తుత టిటిడి పాలకమండలి, అధికారులు ఆ దిశగా ప్రణాళికలతో ముందుకు కదులుతారని ఆశిస్తున్నారు.



# జగనన్న కాలనీకి రోడ్లు మూసివేసిన తమిళ తంబిలు

**పాలసముద్రం, జులై 20 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలంలో జగనన్న కాలనీల్లో నివాసం వున్న ప్రజలకు రహదారి లేకుండా తమిళనాడు రాష్ట్రానికి చెందిన తమిళ తంబిలు రోడ్డును బ్లాక్ చేశారు. కాలనీకి రాకపోకలు సాగిస్తున్న రహదారిని పూర్తిగా బ్లాక్ చేయడంతో జగనన్న కాలనీ వాసులు తమ కాలనీకి వెళ్ళడానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలసముద్రం మండలం ఎస్ఆర్ కండ్రిగ తొట్టికండ్రిగ దళితవాడ గ్రామస్తులకు తమిళనాడు రాష్ట్రం అత్తిమంజేరిపేట జడ్పీ ఉన్నత పాఠశాల వెనుకవైపు వున్న కొండ ప్రాంతంలో గత ప్రభుత్వం జగనన్న కాలనీ లేఅవుట్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ 16 కుటుంబాలు ఇళ్ళను నిర్మించుకుని గత మూడు సంవత్సరాలుగా రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం



జగనన్న కాలనీకి వెళ్ళే రహదారి తమ పట్టా భూమిలో వుందని, ఇటుగా ఎవ్వరు రావడానికి వీలు లేదని తమిళనాడు రాష్ట్రానికి చెందిన కొంతమంది వ్యక్తులు గాడి తీశారు. అలాగే తమిళనాడు వాసులు ఈ దారిలో ఎవ్వరు వెళ్ళకుండా జెసిబి సహాయంతో పెద్ద బండ రాళ్ళను వేశారు. ఈ పరిస్థితుల్లో తమ గ్రామానికి ఎలా వెళ్ళాలో తెలియక గ్రామస్తులు అయోమయం ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలిసిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ డాక్టర్ యుగంధర్ పొన్నా స్పందించి రహదారికి అడ్డంగా తవ్విన గాడితో పాటు రహదారికి అడ్డంగా వేసిన రాళ్ళను ఆదివారం పరిశీలించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన రైతులతో మాట్లాడి తాత్కాలికంగా నడక దారి ఏర్పాటు చేయాలని, అలాగే జిల్లా, మండల స్థాయి అధికారులు ఈ విషయంపై స్పందించి జగనన్న కాలనీ వాసులకు శాశ్వత రహదారి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలసముద్రం మండల జగసేన అధ్యక్షులు లతీష్‌కుమార్, ఉపాధ్యక్షులు రమేష్, నాయకులు మదన్, చందు, కోదండన్, రూపేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశం ధర్మ సత్రం కాదు.. ఎస్‌డిపిఐ క్షమాపణ చెప్పాలి

**పుంగనూరు జులై 20 ప్రభాతవార్త**



దేశం ధర్మ సత్రం కాదని, అక్రమ చొరబాటుదారులపై చర్యలు తీసుకుంటే ప్రధానమంత్రిపై వ్యాఖ్యలు చేసిన ఎస్‌డిపిఐ వెంటనే క్షమాపణ చెప్పాలని పట్టణ బిజెపి అధ్యక్షులు జగదీష్ రాజు బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం గోకుల్ సర్కిల్ నందు ఎస్‌డిపిఐ నాయకులు మాట్లాడిన మాటలను ఖండిస్తూ ప్రెస్ మీట్ నిర్వహించారు. పట్టణ అధ్యక్షులు యం.జగదీష్‌రాజు మాట్లాడుతూ ప్రధాని మోదీ ని మరియు హోమ్ మంత్రి అమిత్ షా లపై మాట్లాడినటువంటి వ్యాఖ్యలను ఖండిస్తూ బేషరతుగా 24 గంటల్లోపు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారు మాట్లాడుతూ దేశమేమీ ధర్మాసత్రం కాదని, పొరుగు దేశాలవారు అక్రమంగా నివసిస్తుంటే ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. దేశంలో అక్రమంగా నివసించే వారికి మద్దతు తెలుపుతూ ఎస్ డి పి ఐ పేర్కొన్న వ్యాఖ్యలు దేశ క్షమించదన్నారు. వారికి మద్దతు తెలిపిన కార్యకర్తలకు ఆత్మ పరిశీలన చేసుకోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజారెడ్డి, ప్రసాద్, పెద్ద మఠం బాబు, అరవ పల్లి వెంకటరెడ్డి, చంద్ర రాజు, నాగరాజ, మణి మొదలియార్, వెంకటేష్, ఉమా శంకర్, సీనా, రమేష్, హర్ష వర్ధన్ రాజు, శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, శేఖర్ బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చల్లాను కలిసిన జనసేన నేతలు

**పుంగనూరు రూరల్, జులై 20, ప్రభాతవార్త**



జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ చల్లా బాబును జనసేన నేతలు ఆదివారం కలిశారు. నియోజకవర్గంలో జనసేన పార్టీకి రావలసిన నామినేటెడ్ పదవులపై చర్చించారు. ఈ సమావేశంలో పుంగనూరు సింగిల్ విండో ఛైర్మన్ పగడాల రమణ, జిల్లా ప్రోగ్రామ్స్ కమిటీ సభ్యులు చైతన్య రాయల్, టౌన్ ప్రెసిడెంట్ నరేష్ రాయల్, మండల ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, నాయకులు అంబరీష్, నవీన్ రాయల్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. పార్టీకి ప్రాతినిధ్యం ఉండేలా నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు.

## వర్షంతో సేదతీరిన పుంగనూరు

**పుంగనూరు రూరల్, జులై 20, ప్రభాతవార్త**



పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఆదివారం సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఏక బిగిన గంటపాటు కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. వర్షం మొదలవడంతో జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించింది. బయట పనుల నిమిత్తం వచ్చి ఉన్న ప్రజలు ఇళ్లకు చేరడానికి వ్యవస్థలు పడాల్సి వచ్చింది. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చల్లని వాతావరణం నెలకొంది. అయితే చివరి దశలో ఉన్న టమేటా పంట పూర్తిగా ధ్వంసమయ్యాయి.

## చల్లా బాబును కలిసిన ఏఎంసీ చైర్మన్

**పుంగనూరు, జులై 20, ప్రభాతవార్త**



మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా నియమితులైన సమీపతి యాదవ్ నియోజకవర్గం దేశం ఇన్చార్జ్ చల్లా బాబును కలిశారు. పుంగనూరు నుండి పెద్ద ఎత్తున వాహనాలలో రలిక వెళ్లిన సమీపతి యాదవ్ తన నియామకానికి సహకరించిన చల్లా బాబు ఆశీస్సులు అందుకున్నారు. తనపై నమ్మకంతో పదవి కేటాయించిన పార్టీ అధిష్టానానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దేశం నాయకులు మాధవరెడ్డి సివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా కార్యకర్త మృతి.. ఘన నివాళులు



**శాంతిపురం, జులై 20 ప్రభాతవార్త**

మండలంలోని శాంతపల్లికి చెందిన తెదేపా కార్యకర్త మునిరత్నం బెంగళూరులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం శాంతంపల్లిలో ఆయన మృతదేహానికి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మునిరత్నం కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## బలిజసంఘంచే యాభైవేల ఆర్థికసాయం

**కుప్పంరూరల్, జులై 20 ప్రభాతవార్త**



ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి బలిజ సంఘంచే ఆర్థికసాయం చేశారు. మండలంలోని వేపూరుకు చెందిన గోపి మేస్త్రీ పనిచేసేవాడు. రెండు రోజుల క్రితం ఇతను భవనంపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నాడు. విషయం తెలుసుకున్న కుప్పం బలిజ సంఘం నేతలు అతని చికిత్స కోసం తమ వంతుగా సంఘం తరపున యాభైవేల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేఆరు. కార్యక్రమంలో నియో జకవర్గ బలిజ సంఘ అధ్యక్షుడు గోపీనాథ్, కుప్పం రూరల్ సంఘ అధ్యక్షుడు డీలర్ వెంకటేష్, సభ్యులు మంజునాథ్, చలపతి, కృష్ణమూర్తి, బగ్గిడి వెంకటేష్, శేషగిరి, రాజేంద్ర, శివరాయల్ పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం కృషితో 39473కోట్ల పెట్టుబడులు

**– మాజీ ఎమ్మెల్సీ గౌనివారి**

**శాంతిపురం, జులై 20 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ల చొరవతో కూటమి ప్రభుత్వం చొరవతో రాష్ట్రానికి కొత్తగా 39473కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు 22 ప్రాజెక్టులు వచ్చాయని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పారిశ్రామిక వికేంద్రీకరణకు సిఎం చంద్రబాబు పెద్దపీట వేశారన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాకా, శ్రీసిటీ నుంచి కర్నూలు వరకు ఈ ప్రాజెక్టులు ఏర్పాటుకానున్నాయన్నారు. 30899మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

## మిథున్‌రెడ్డి అరెస్టు కుట్ర పూరిత చర్య : వైకాపా



**చౌడేపల్లి, జులై 20 ప్రభాతవార్త**

రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అరెస్ట ప్రభుత్వ కుట్రపూరిత చర్యని వైకాపా మండలాధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి అన్నారు. ఎపి లిక్కర్‌స్కామ్‌లో ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని అరెస్టు చేసినందుకు నిరసనగా స్థానిక జంగాలపల్లి రమణ భవనంలో విలేకరుల సమావేశం జరిగింది. మిథున్‌రెడ్డి అరెస్ట కేవలం రాజకీయ కుట్రలో భాగమే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల నుంచి వైకాపా ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చక పోగా ప్రశ్నిస్తారనే ఉద్దేశ్యంతో వైకాపా నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైళ్ళల్లో వేయిస్తున్నారని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం ఇలాంటి పోకడలకు స్వస్తి పలకాలన్నారు. ప్రజలంతా పెద్దిరెడ్డి కుటుంబానికి సైనికుల్లా పనిచేస్తామన్నారు. వైకాపా నాయకులు నడింపల్లి దామోధర్‌రాజు, మిద్దింటి శంకరనారాయణ, కూరపర్తి అంజిబాబు, కళ్యాణ్‌భరత్, రుక్మిణమ్మ, నరసింహులుయాదవ్, పవన్‌రాయల్, ఠాణాదార్ నాగరాజ, మోహన్‌రాయల్, వెంకట్రమణ, మండలంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

**- కడ పి.డి. వికాస్ మర్మత్**

**కుప్పం, జులై 20 ప్రభాతవార్త**



కుప్పం మండల కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంను అనివార్య కారణాలచేత ఈనెల 21న రద్దు చేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విద్యుత్ షాక్ కు గురై వ్యక్తి మృతి

**గంగాధర నెల్లూరు, జులై 20 ప్రభాతవార్త:**

మండలంలోని మిట్ట కొత్తూరు గ్రామంలో లోకేష్ (35) విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. వివరాల్లోకెళ్తే మిట్ట కొత్తూరు గ్రామానికి చెందిన వరదరాజుల నాయుడు కుమారుడు లోకేష్ ఆదివారం తమ చెట్టులోని మునగకాయలు కోస్తుండగా చెట్టు విద్యుత్ లైనుకు తగిలి విద్యుత్ షాక్ గురై కిందపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడు లోకేష్‌కు పెళ్లి అయిన కొంతకాలం పిల్లలు లేకపోవడం ఇటీవలే భార్య గర్భిణిగా వుండగా ఇతడు మృత్యువాత పడడంతో గ్రామస్తులు కన్నీరుమున్నీరైనారు. ఈ సందర్భంగా పోలీస్ ఇన్స్పెక్టర్ వాసంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు .పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

టిడిపికి తీరని లోటు పెనుమూరు మార్కెట్ కమిటి కృష్ణమ నాయుడు మాట్లాడుతూ లోకేష్ మరణం టిడిపికి తీరని లోటని పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని అన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, జులై 20 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం ఉదయం 10 గంటల నుండి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారన్నారు. అలాగే నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

## నేడు పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్

**చిత్తూరు, జులై 20 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీసు అధికారుల దృష్టికి ఈ కార్యక్రమంలో తీసుకువస్తే వాటిని పరిశీలించి పోలీసు అధికారులు సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు.

## మంత్రి మండిపల్లి నివాసానికి తరలిన తెలుగు తమ్ముళ్ళు

**చౌడేపల్లి, జులై 20 ప్రభాతవార్త**



రాష్ట్ర మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ నివాసానికి మండలంలోని తెలుగు తమ్ముళ్ళు తరలి వెళ్ళారు. మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు తొలుత రొంపిచర్లలోని నియోజకవర్గ ఇన్‌ఛార్జీ చల్లా రామచంద్రారెడ్డిని కలసి అనంతరం చిన్నమండెంలోని మంత్రి మండిపల్లి నివాసంలో జరుగుతున్న బోనాల జాతరలో పాల్గొన్నారు. పూల చంద్రమౌళి, శ్రీధర్‌రాజు(గిరి), బోయకొండ జన్నే సుబ్రమణ్యం, కుమార్‌రెడ్డి, వెంకట్రమణ, పూల సురేంద్ర, మండలంలోని తేదేపా నాయకులు, కార్యకర్తలు జాతరలో పాల్గొన్నారు.



## రేపు కుప్పంలో జాబ్ మేళా

**- ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్**

**- ఇరవైకు పైగా కంపెనీల ప్రతినిధుల రాక !!**

**కుప్పం, జులై 20 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం కడ కార్యాలయంలో ఈనెల 22న జాబ్ మేళా కార్యక్రమాన్ని కడ, వన్ఎంవన్‌బి సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఫ్లిప్‌కార్ట్, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో, టెక్ మహీంద్రా, రేమండ్, జెబిఎం, శ్రీరామ్ చిట్స్, ఔటోప్లైనీ, కాల్‌మెన్, ఎంఆర్ఎఫ్ టైర్స్ తదితర సంస్థల ప్రతినిధులు ఈ ఇంటర్వ్యూలను నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ,డిప్లమో, పిజి కోర్సులు చదివిన యువత ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఉద్యోగాలకు ఎంపికయ్యేవారికి 14-16వేల జీతం ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికయ్యేవారు కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, పూణే ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. జాబ్ మేళాకు ముందుగా ఈనెల 21న సోమవారం కడ కార్యాలయంలో అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్ కార్యక్రమం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 59మంది ఎంపిక

**కుప్పం, జులై 20 ప్రభాతవార్త**



సాయిమాతా సేవా ట్రస్ట్ అధ్వర్యంలో ఆదివారం కుప్పం బాలుర హైస్కూల్‌లో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి అధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 220మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఉచిత ఆపరేషన్లకు 59మందిని ఎంపిక చేశారు. వీరికి సోమవారం బెంగళూరులో ఆపరేషన్లు నిర్వహిస్తారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజేష్, లావణ్య, నేత్ర, మటార్లపల్లి వీరభ ద్రప్ప, ట్రస్ట్ వ్యవస్థాపకులు డిఎన్ జగదీష్‌బాబు పాల్గొన్నారు.

# దిగువమాఘంలో అలరించిన దుర్యోధన వధ

## -కిక్కిరిసిన భక్తజనం

**తవణంపల్లె, జులై 20 ప్రభాతవార్త:**

మండలంలోని దిగువమాఘం గ్రామంలో జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరిగిన దుర్యోధన వధ ఘట్టం ఆహుతులను అలరించింది. గ్రామంలోని బహుదానది ఒడ్డున వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ధర్మకర్త ఆర్.ఉమాపతిరెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచం ద్రనాయుడుల సహకారంతో గ్రామస్థులు గత నెల 27 నుండి మహాభారత యజ్ఞం కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం విధితమే. ఇందులో భాగంగా మహాభారత యజ్ఞంలో చివరి రోజు దుర్యోధన వధ ఘట్టం అట్టహాసంగా జరిగింది. కాణిపాకంకు చెందిన ఓం మురుగన్ నాట్యమండలి కళాకారులు దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ద్రౌపదీ సమేత



ధర్మరాజుల స్వామి వారి ఆలయంలో ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం బహుదానదిలో బంకమట్టితో దుర్యోధనుడి బొమ్మను తీర్చిదిద్ది ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు దుర్యోధనుడిని భీమసేనుడు మడుగు నుండి రప్పించే సన్నివేశం కళ్ళకు కట్టినట్లు కళాకారులు ప్రదర్శించారు. అలాగే దుర్యోధనుడు, భీమసేనుల మధ్య యుద్ధ సన్నివేశాలు, పద్యాలు అలరించాయి. భీమసేనుడు దుర్యోధనుడిని తొడపై గదతో కొట్టి వధించి రక్తాన్ని ద్రౌపదీదేవి కురులకు పూసే సన్నివేశాల్లో పాత్రదారులు జీవం పోశారు. ఈకార్యక్రమంను తిలకించడానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వేలాది మంది భక్తులతో బహుదానది కిక్కిరిసింది. ఈకార్యక్రమంలో నిర్వహకులు జ్యోతీశ్వరనాయుడు, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, రాజశేఖర్‌నాయుడులతో పాటు వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

## బాలదండాయుధపాణి స్వామివారి సేవలో తుడా చైర్మన్

**తిరుపతి రూరల్, జులై 20 ప్రభాతవార్త:**



తిరుపతి రూరల్ మండలం తనపల్లిలో పద్మగిరి కొండపై వెలసిన బాలదండాయుధపాణి స్వామిని కృత్తిక పర్వదినం సందర్భంగా ఆదివారం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు,అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి దర్శన ఏర్పాట్లను చేశారు. తుడా చైర్మన్ స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు తుడా చైర్మన్‌కి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించగా, అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు సందీప్ రెడ్డి, బాలసుబ్రమణ్యం రెడ్డి, సుబ్రహ్మణ్యం, నాగార్జున తనపల్లి, కుంట్రపాకం గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## క్యాంపస్‌లో సంబరాలు



**బొజ్జల వాలిబాల్ పోటీ విజేతలకు బహుమతులు**

**శ్రీకాళహస్తి,జులై 20 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తిలోని యువతను ప్రోత్సహించుటకు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి క్రీడలను నిర్వహించారు.ఈ నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో యువతకు బొజ్జల వాలీబాల్‌పోటీలను నిర్వహించుటకు సూచించారు. ఒరెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో ఆంధ్రనుంచే కాకుండా చెన్నైలో ఉన్న యువకులు కూడా పోటీల్లో పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో విజేతలకు ఆదివారంరాత్రి బహుమతి ప్రధానోత్సవం ఏర్పాటు చేసారు. విజేతలుగాకేనేపల్లి, రన్నర్ గా వి.స్పోర్ట్స్ కల్లబ్ మూడవ బహుమతిని రోహిత్‌టీం, నాలుగవ బహుమతి కారూరు,5వ జట్టుగా సూర్యటీం, 6వజట్టుగా శ్రీకాళహస్తి హైస్కూల్ నిలిచారు. వారికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ అందించారు. విజేత కేనేపల్లికి బహుమతిగా రూ.20వేలు రన్నర్‌అప్స్‌గా నిలిచిన వి.స్పోర్ట్స్ శ్రీకాళహస్తి క్లబ్‌కు రూ.15వేలు, 3వ జట్టు రోమిత్‌టీం తదితర జట్టులకు రూ.5వేల చొప్పున నగదు బహుమతితో పాటు సర్టిఫికేట్లను అందించారు.ఈ కార్యక్రమాల్లో బృందమ్మతో పాటు పట్టణపార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్, మాజీ కౌన్సిలర్ బషీర్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన పులిచెర్ల వైసిపి నాయకులు

**పులిచెర్ల, జులై 20, ప్రభాతవార్త**



మాజీ మంత్రి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో పులిచెర్ల వైసీపీ మండల అధ్యక్షుడు నాదముని రెడ్డి, నాయకులు కేశవరెడ్డి, కోదండయ్య, ఎస్వీ రమణ, శివ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కక్షపూరితంగా అరెస్ట్ చేశారని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఎప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.

## అందరితో కలసి అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

**-తిరుపతి జిల్లా ఎస్‌బి డిఎస్పీగా వెంకటనారాయణ**

**తిరుపతికార్పొరేషన్, జులై 20ప్రభాతవార్త**



తిరుపతిజిల్లాలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచుతామని, ప్రశాంత జిల్లాను మరింతగా పోలీసుల సేవలందించేలా చూస్తానని తిరుపతి జిల్లా ఎస్‌బి డిఎస్పీ జొన్నలగడ్డ వెంకటనారాయణ తెలిపారు. ఆయన ఆదివారం తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఎస్‌బి డిఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఈ సందర్భంగాజిల్లాఎస్పీహర్షవర్ధన్‌రాజును,అదనపుఎస్పీలువెంకట్రావు, రవిమనోహర చారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్‌బి డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంకటనారా యణను ఎస్‌బివిభాగం సిబ్బంది జిల్లాలోని పలువురు డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## తుమ్మలగుంటలో 'సుపరిపాలనలో తొలి అడుగులో' వెనక అడుగు

**తిరుపతిరూరల్, జులై 20 ప్రభాతవార్త:**

తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం వెనకంజలో నత్తనడకన నడుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన చేసిన అభివృద్ధి, జరుగుతున్న అభివృద్ధితో పాటు గత వైకాపా పాలనకు కూటమి పారదర్శక పాలనకు వ్యత్యాసం చూపిస్తూ ప్రజలకు తెలియజేయాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టిన విషయం తెల్సిందే. టిడిపి నాయకుల మధ్య సత్ససంబంధాలు లేనందున ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల దృష్టికి తీసుకెళ్ళడంలో విఫలమైనట్లు తెలుస్తుంది. ప్రతి శనివారం స్వచ్ఛాంధ్రా స్వర్ణా కార్యక్రమం కేవలం ఫోటోలకు ఫోజులు ఇచ్చుటకే నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తుమ్మలగుంట గ్రామ పంచాయతీలో తుమ్మలగుంట గ్రామం, హరిజనవాడ, అరుంధతివాడ, ఎస్టీ కాలనీ, ఉప్పరపల్లి గ్రామం, ఉప్పరపల్లి హరిజనవాడ, అరుంధతి వాడలు ఉన్నాయి. స్వచ్ఛాంధ్రా స్వర్ణాంధ్రా కార్యక్రమాన్ని ఆయా కాలనీలలో నిర్వహించకుండా కేవలం సచివాలయం ముందరే నిర్వహించి, ఫోటోలకు ఫోజులు ఇస్తున్నారని విమర్శలు ఉన్నాయి. ఎలాంటి కార్యక్రమంలో పాల్గొనని వ్యక్తులు కూడా అన్ని కార్యక్రమాలలో పాల్గొంటున్నట్లుగా ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు. తుమ్మలగుంట టిడిపి నాయకుల తీరు పట్ల స్థానిక ప్రజాప్రతినిధి సీరియస్‌గా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

## కపిలతీర్థం జలపాతం నీటిని నిల్వచేసేలా చూడండి

**తాగునీటి అవసరాలకు వనరులు పెంపు**

**సిఎంకు విజ్ఞప్తిచేశానన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్**

**తిరుపతిరవాణ,జులై 20ప్రభాతవార్త**



తిరుపతి కపిలతీర్థం నుండి వర్షపునీరు వృధాగా పోకుండా ,కలుషితం కాకుండా నిల్వచేసేలా చూడాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సిఎం చంద్రబాబును కలసి విజ్ఞప్తి చేశానన్నారు. తిరుపతిపై ప్రత్యేక దృష్టి సారించిన సిఎం కపిలతీర్థం జలపాతం నీటిని సంరక్షించుకునేలా తగిన చర్యలు తీసుకునే దిశగా ఆదేశాలివ్వాలని కోరారు. వర్షమొస్తే తిరుపతి నగర ప్రజలు ముఖ్యంగా కపిలతీర్థం దిగువన ఉన్న శివజ్యోతినగర్, సుభాష్‌నగర్, ఎర్రమిట్టవీధి,కపిలతీర్థంరోడ్డు, శ్రీనగర్‌కాలనీ, అబ్బన్నవీధి పల్లపుప్రాంతాలు జలమయంగా మారుతూన్నాయన్నారు. వర్షపునీరు కూడా కలుషితమవుతోందన్నారు. కపిలతీర్థం కొండ ప్రాంతంలో వర్షపునీరు 50శాతం నిల్వచేసేకునే జలాశయం ఏర్పాటుచేయాలని, మిగిలిన నీటిని నీటినిల్వచేసేలా వాటర్ రిజర్వాయర్ నిర్మించడం వల్ల తిరుపతి తాగునీటి అవసరాలకు వాడుకోవచ్చని తెలిపారు. తిరుమలకొండపై నుండి వచ్చే పవిత్రనీటిని వినియోగించుకుంటే ప్రయోజనం ఉంటుందని సామంచి శ్రీనివాస్ కోరారు. దీనిపై సిఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## న్యాయవిభాగం సేవలు బాగున్నాయి



పద్మావతి మహిళ వర్సిటీలో సుప్రీంకోర్టు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్‌సింగ్ ఆదివారం వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమనుకలిశారు. న్యాయవిభాగం సేవలుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభాతవార్త–తిరుపతి

# అన్ని బాగున్నాయి . . . పోలీసు సేవలు భేష్

## ఆలయ సిబ్బంది స్పందన సూపర్

శ్రీకాళహస్తి, జూలై 20 ప్రభాతవార్త





ఆడికృత్తిక మహోత్సవాల సందర్భంగా విజ్ఞానగిరిపై వెలసి ఉన్న కుమారస్వామిని దర్శించుకోవటానికి వచ్చిన భక్తులకు సత్వర దర్శనం, సుదర్శనం కోసం రూపకల్పన చేసిన క్యూలైన్లు చక్కగా భక్తులకు సుదర్శనం అవకాశం కల్పించారు. దేవస్థానానికి అధికారులకు మంచి పేరు రావాలంటే అధికారు లు,సిబ్బంది సమన్వయం తో పని చేయాలని ఇతర శాఖల అధికారుల సహకారం ఎంతో అవసరం అని భావించిన ఇఓ బాపిరెడ్డి అన్ని శాఖలతో సమన్వయం తో పని చేశారు.. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పలచగా వచ్చారు. వేలాది మంది వచ్చినా ఎక్కడా ఆగకుండా క్యూ లైన్లు ఇఇ మురళీధర్‌రెడ్డి వారి సిబ్బంది డివైయస్‌పి నరసింహ మూర్తి, సిఐ డి.గోపిలతో చర్చించి రూపకల్పన చేశారు. అంతేకాక ఆలయ సిబ్బంది సేవలు అభినందనీయం ఎక్కడా దర్శనాలకు ఇబ్బంది లేకుండా దర్శనానికి వచ్చే భక్తులు ఓ మార్గంలో బయటకు వెళ్ళు భక్తులు మరో మార్గంలో ఏర్పాటు చేశారు. ఇఓ డి.బాపిరెడ్డి మాట్లాడుతూ 'సామాన్య భక్తులకు సుదర్శనమే ప్రధాన అజెండాగా క్యూలైన్లు రూపకల్పన చేశామన్నారు.' సుమారు 60వేల మంది భక్తులు వచ్చినా ఎక్కడా ఇబ్బంది లేకుండా దర్శనభాగ్యం కల్పించా మన్నారు. ఇక తెప్పోత్సవాన్ని కూడా అంగరంగవైభవంగా నిర్వహిం చుటకు చర్యలు తీసుకున్నామన్నారు. తలనీలాలు సమర్పించుకొను భక్తులకు నీటి సదుపాయాన్ని కల్పించటంలో ఇంజనీరింగ్ ఇఇ మురళీధర్‌రెడ్డి వారి సిబ్బంది చొరవ ప్రశంసనీయం అన్నారు. ముఖ్యంగా క్యూలైన్ల రూపకల్పనలో పోలీసులు సహకరించారని అయన అభిప్రాయపడ్డారు.ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటి ఇఓ ఎస్ ఆర్ కృష్ణారెడ్డి ఎఇఓలు హేమామా లిని, విద్యాసాగర్‌రెడ్డి,లోకేష్‌రెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య,దుర్గా ప్రసాద్‌లు విఐపి క్యూ అని బోర్డు ఏర్పాటు చేసి అనుమతించారు.

**పోలీసుల భారీ బందోబస్తు:-**

ఆడికృత్తిక మహోత్సవాల్లో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. డివిజన్‌లోని పోలీసులతోనే డివైయస్‌పి నరసింహ మూర్తి, సిఐలు డి.గోపి, నాగార్జునరెడ్డి,తిమ్మయ్య వారి సిబ్బందితో పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించి అమలు చేశారు. ఆలయ సిబ్బంది క్యూలైన్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలుతీసుకున్నారు. కొండపై దర్శనానికి వెళ్లే భక్తులు, వచ్చేభక్తులకు ఒకే దారి ఉండేది. కొన్ని సంవత్సరాలుగా ఈ విధానాలు మార్చడంతో భక్తులకు ఎలాంటి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగుతుంది. ఇకపెండ్లిమండపం వద్ద నుంచి ట్రాఫిక్‌ను మళ్లించారు. తిరుపతి నుంచి వచ్చే బస్సులు బైపాస్‌మీదుగా బస్తాండుకు రప్పించి , తిరుపతికి వెళ్లే బస్సులను ఆర్టీసి బస్టాండు నుంచి శివసర్కిల్, జయరామారావువీధి మీదుగా మళ్లించారు. ఇక నారదపుష్కరిణి వద్ద పలువురు పోలీసులు నిఘా ఉంచారు. కొండపై స్వామి దర్శనార్థం నిరీక్షిస్తున్న భక్తులకు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలందించారు.

# తిరుపతి డివిజన్

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

తిరుపతిరూరల్, జూలై 20 ప్రభాతవార్త:




దుర్గసముద్రం జిల్లా ఉన్నత పాఠశాలలో 1983-84 విద్యా సంవత్సరంలో పదోవ తరగతి చది విన పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ హోటల్లో ఆత్మీయ సమావేశం నిర్వ హించుకున్నారు. పూర్వ విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని, చిలిపి క్వచన్స్‌తో పాటు ఎవ్వేర్వరు ఎలాంటి వృత్తుల్లో ఉన్నారరో తెలుసుకున్నారు. ఎవ్వర్వేరు ఏఏ వృత్తోల్లో ఉన్నారు....పిల్లలు, కుటుంబ సభ్యుల విరాలను తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన తమ ప్రధాన ఉపాధ్యాయుడు మునిరెడ్డి, ఉపాధ్యాయులు మల్లిఖార్జునరెడ్డి, రామ్మూర్తిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్రరెడ్డి, రాంభాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌డీలర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గుత్తా కోటేశ్వరరావు

తిరుపతిరూరల్, జూలై 20 ప్రభాతవార్త:



రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా గుత్తా కోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం విజయవాడలోని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రేషన్ డీలర్స్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా వెంకటేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శిగా గుత్తా కోటేశ్వరరావు, రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షరాలుగా పి.హేమలతలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గుత్తా కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రేషన్ డీలర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘ అధ్యక్షులు దివి లీల మాధవరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## షణ్ముఖునికి ప్రత్యేకాభిషేకాలు

తొట్టంబేడు,జూలై 20 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి-చెన్నై రోడ్డులో వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్న షణ్ముఖ సుబ్రమణ్యం స్వామికి ఆదివారం ఆడికృత్తిక సందర్భంగా విశేష అభిషేకాలు,అలంకారాలు జరిపారు.ఇటీవల ఈ ఆలయాన్ని జీర్ణోద్ధారణ గావించారు. ఈ ఆలయంలో వెలసిన మహిమాన్వితుడైన షణ్ముఖ సుబ్రమణ్యం స్వామికి ఆడికృత్తిక సందర్భంగా రక రకాల పూలతో అలంకరించారు. ఆలయాన్ని నిత్యకళ్యాణం పచ్చతీరణంలా ముస్తాబు చేసారు.ఇక్కడ భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు మహేష్‌శర్మ సుబ్రమణ్యం స్వామి జన్మ వృత్తాంతాన్ని భక్తులకు వివరించారు.ఓ వైపు పూజలు అభిషేకాలు మరోవైపు భక్తుల అన్నదానాలు వివిధ రకాల వితరణలతో కళ కళ లాడింది.

## ఎస్‌వి ఆసుపత్రి సేవలు

తొట్టంబేడు,జూలై 20 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వ హిస్తున్న విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడికృత్తిక బ్రహ్మోత్స వాలలో భాగంగా ఆదివారం ఆడికృత్తికను పురస్కరించుకొని వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సామాజిక సేవలో ముందు వరుసలో ఉన్న రోటిరియన్ డాక్టర్ ఎస్ లక్ష్మీనారా యణ ఇక్కడ భక్తుల సౌకర్యార్థం ఉచిత దంత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు.సుమారు 500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. పలువురికి ఉచితంగా మందులను అందించారు. పలువురి దంత సమస్యలకు సంబంధించి వివరించారు.ఈ కార్యక్రమాల్లో డాక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశాలతో డాక్టర్లు సౌమ్య,డాక్టర్ భరత్,డాక్టర్ శశిలు సేవల్ని అందించారు.ఉచితంగా పేస్టులు అందించారు.

## బండారుపల్లిలో బాధలు తీర్చేదెవరు?

### చెరువులను మరిపిస్తున్న రోడ్డు

శ్రీకాళహస్తి రూరల్,జూలై 20 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో సమస్యలు తిష్టవేసాయి. గత పాలనలో అభివృద్ధి పేరుతో లక్షలకు లక్షలు వెచ్చించినా ప్రగతి ఎక్కడ జరిగిందో అంతుపట్టడం లేదు. ఒక్కొక్క గ్రామాన్ని పరిశీలిస్తే దీన గాథలు వినబడుతున్నాయి. ముఖ్యంగా ద్వితీయశ్రేణి నాయకులనబడే వారి గ్రామాల్లో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.కూటమి పాలనలో గ్రామాల్లోని మండల నాయకుల గ్రామాల్లో కనీస సదుపాయాల్లేక జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో ఏర్పేడు మండలంలోని పలు గ్రామాల్లో పరిస్థితి ఇదే. ఈ నేపథ్యంలో రాష్ట్ర కార్యదర్శిగా అధినాయకులతో సరాసరి మాట్లాడే నాయకుడుగా రెడ్డి వారి గురువారెడ్డికి పేరుంది.అయితే ఆయన స్వగ్రామమైన బండారుపల్లిలో చినుకు పడితే వీధుల్లో కాలు పెట్టే పరిస్థితి లేదని తెలిసింది. ఈ పంచాయతీలో మండలంలోని పెద్ద పంచాయతీల్లో బండారుపల్లి గ్రామం ఒకటి ఈ గ్రామంలో బిసిలే అత్యధికం. ఈ గ్రామంలో రైసుమిలువీధి, కడవీధి, రెండు వీధుల్లో నాలుగురోజులుగా రాత్రివేళల్లో కురుస్తున్న వర్షంతో వీధులు తటాకాలుగా మారాయి.ఈ సమస్యను గతంలో కూడా పలుమార్లు అధికారులు,నాయకులు పట్టించుకోవటం లేదని ప్రజలు వాపోతున్నారు. రెండేళ్ళ క్రితం ఈ గ్రామంలో ఎంపి నిధుల నుంచి లక్షలు వెచ్చించి డ్రైనేజి కూడా కట్టించారు. కానీ ఆ కాలువలు ఎక్కడ ఉన్నాయో? ఎవరికి అంతుపట్టడం లేదని విమర్శలున్నాయి.అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదనేది శేష ప్రశ్న.ఈ వీధుల్లో వృద్ధులు చిన్నపిల్లలు వెళ్ళాలంటే తిప్పలు పడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని కోరుతున్నారు.

## తిరుపతి ఐఐటిలో విద్యార్థుల సంబరాలు

శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త






శ్రీకాళహస్తి నియో జక వర్గంలోని ఏర్పే డులో వెలసిన తిరుపతి ఐఐటి ఏడవ స్నాతకోత్స వాన్ని సొంతభ వనాల్లో జరుపుకు న్నారు. ఆదివారం ఉదయంనుంచి ఐఐటి ఆవరణలో సంబరాలు చోటు చేసుకున్నాయి. డైరెక్టర్ ప్రో.సత్యనారాయణ సారధ్యంలో సంబరాలను జరుపుకున్నారు. విద్యార్థులు,అధ్యాపకులు తరతమబేదాలు విస్మరించి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆదివారం రాత్రి ఏర్పాటు చేసినస్నాతకోత్సవం సభలో సుమారు 500 మంది విద్యార్థులకు సర్టిఫేకేట్లను పతకాలను అందించారు. సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ పదేళ్ళముందు ఈ మండలంలో ఐఐటి ఆవిర్భావానికి పునాది రాయి పడిందన్నారు. పదేళ్ళకాలంలో సాగిన ప్రయత్నాలను వివరిస్తూ ఈ ఏడాది సొంత క్యాంపస్‌లో స్నాతకోత్సవం జరపటం తనకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.అలాగే అధ్యాపకులు ఐఐటి పేరు ప్రతిష్టలను జాతీయ స్థాయిలో రాణించుటకు చేసిన కృషిని వివరించారు. అలాగే పరిశోధనలు సాధించినప్రగతిని వివరించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా కేరియ విశ్వవిద్యాలయం సహా వ్యవస్థాపకుడు కాగ్నిజెంట్‌మరియు ఛాన్సలర్ లక్ష్మీనారాయణన్, జేయస్‌డబ్ల్యు గ్రూప్ చైర్మెన్ తిరుపతి ఐఐటి బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ సజ్జన్‌జిందాల్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు వారి ఉత్సాహం తో క్యాంపస్ సంబరాల్లో మునిగి తేలింది.రాబోవు రోజుల్లో చేపట్టే కార్యక్రమాలను డైరెక్టర్ సత్యనారాయణ వివరించారు. విద్యార్థులు మనస్సు పెడితే ఏదైనా సాధించవచ్చునన్నారు.

## అందరిని అలరించిన బుద్ధినితో నా ప్రయాణం..

రేణిగుంట జూలై 20 ప్రభాతవార్త



ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో శనివారం రాత్రి ప్రదర్శించిన " బుద్ధునితో నా ప్రయాణం అందరిని అలరించింది. నాటక ప్రదర్శన అనంతరం రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ " బుద్ధునితో నా ప్రయాణం" నాటకంలో నటించిన కళాకారులు అభినయాలు అద్భుతం అన్నారు .మనిషి మంచి మార్గంలో నడవడానికి మతం సహాయ పడాలన్నారు.బౌద్ధం మతం కాదని మంచి మనుషుల జీవన విధానం అని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అన్ని మతాలవారు ఎన్నో ప్రలోభాలు పెట్టి ఆహ్వానించినప్పటికీ ఆయన బౌద్ధాన్ని స్వీకరించారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బుద్ధ భగవానుని ప్రవచనాలు, సందేశాలు ప్రపంచ శాంతికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. అంబేద్కర్ భవన్ చైర్మన్ డాక్టర్ పరమశివన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం నందుమాజీ మంత్రి పరసా రత్నం,ఎస్వీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సి.హెచ్.అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోపి, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రసాద్ రావు, బి.సి.సంఘర్షణ సమితి దక్షిణాది రాష్ట్రాల కో ఆర్డినేటర్ ఆల్మెన్ రాజు, బంతేజీ,ఆర్.పి. ఐ.నాయకులు అంజయ్య, సి.పి.ఎం.నాయకులు కందారపు మురళి,డాక్టర్ ధనాశేఖర్,మురళి,గాలి రవి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును సత్కరించిన టిడిపి మండల పట్టణ అధ్యక్షుడు

రేణిగుంట, జూలై 20 ప్రభాతవార్త



తిరుపతి పర్యటన ముగించుకుని గన్నవరం వెళు తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును రేణి గుంట మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్ట ణ అధ్యక్షుడు మహబూబ్ బాషా తిరుపతి విమా నాశ్రయంలో శనివారం రాత్రి కలిసారు. చంద్ర బాబు నాయుడు పై ఉన్న అపారమైన గౌరవాన్ని ప్రదర్శిస్తూ ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. చంద్రబాబు నాయుడు ఇరువురు నాయకులను ఆప్యాయంగా పలకరించారు.

## సిపిఐ నూతన కార్యవర్గం

తిరుపతి రవాణ,జూలై 20ప్రభాతవార్త





తిరుపతి జిల్లా సిపిఐ నూతన కార్యవర్గసమావేశంలో నగర కమిటీని ఎన్నుకున్నారు. రెండురోజులు జరిగిన సమావేశంలో ఆదివారం సిపిఐ నగర కార్యదర్శిగా విశ్వనాథ్, సహాయకార్యదర్శిగా బండి చలపతి ఎన్నికయ్యారు. సిపిఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు హరినాథరెడ్డి,రామానాయుడు,జిల్లా కార్యదర్శి మురళీ పాల్గొని నూతన నగర కమిటీని ఎంపికచేశారు. కార్యవర్గసభ్యులుగా ఎన్‌డి రవి, శివ, కెవైరాజా, పద్మనాభరెడ్డి, డాక్టర్ ఎండి ప్రసాద్, డాక్టర్ బలరాం, ఉదయ్‌కుమార్, మహేంద్ర, నాగరాజు, మంజుల,రత్నమ్మ ఎన్నికయ్యారు. కార్మికుల పట్ల,పేదప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని తెలిపారు.

## తెలుగు గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి విద్య, జూలై 20 ప్రభాతవార్త

తిరుపతి జూపార్క్ రోడ్డులోని ఉదయమాణిక్యం మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో తెలుగు(టిజీటీ) గెస్ట్ ఫ్యాకల్టీ పోస్ట్ కు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.రేష్మ తెలిపారు.ఈనెల 23వ తేదీలోపు జూపార్క్ రోడ్డు టాటా క్యాన్సర్ ఆస్పత్రికి ఎదురుగా ఉన్న పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని ఆమె పేర్కొన్నారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏంఏ (తెలుగు),బీఈడీ కలిగి ఉండాలని, మరిన్ని వివరాలకు 9000783185 నంబర్ ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

## అమర ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం

రేణిగుంట జూలై 20 ప్రభాతవార్త

రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అమర ఆసుపత్రిలో ఆసుపత్రి వైద్యులు కవర్డ్ సిపి స్టంట్ ప్రక్రియ ద్వారా 49 సంవత్సరాల మహిళకు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఓ పల్లెటూరి చెందిన 49 ఏళ్ల మహిళ నియంత్రణ లేని రక్తపోటు, అలసట, ఊపిరి తీసుకోవడంలో కష్టం తదితర సమస్యలతో బాధపడుతుంది. ఈ జబ్బులతో చాలాసార్లు ఊపిరితిత్తుల సమస్యగా భావించి అనేక ఆసుపత్రుల్లో చేరాల్సి న పరిస్థితులు ఏర్పడ్డాయని అమర ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఆమె అమర ఆసుపత్రి కి చికిత్స కోసం వచ్చారు. అమర ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి గుండె కుడి కామన్ లియాక్ ఆర్టరీలో తీవ్రమైన బ్లాక్ ఉన్నట్లు గుర్తించారు. వైద్యులు అత్యాధునిక సాంకేతిక విధానాన్ని ఉపయోగించి శస్త్ర చికిత్స విజయవంతంగా చేశారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ వెంకట శివకృష్ణ, డాక్టర్ వెంకటేష్ గురజాల, డాక్టర్ ఎం నాగరాజు, డాక్టర్ సయ్యద్ మోహన్ నౌషాద్, అనస్తీషియన్ డాక్టర్ హేమంతులకు రోగి బంధువులు ధన్యవాదాలు తెలిపారు.

## వ్యాపార రంగంలో ఉన్నతికి చక్కటి వేదిక బీఎన్ఐ

తిరుపతి కలెక్టరేట్, జూలై 20 ప్రభాతవార్త :




వివిధ వ్యాపార రంగాలు, పారిశ్రామిక రంగాలలోని వారు ఉన్నతంగా ఎదిగేందుకు బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) చక్కటి వేదికగా దోహదపడుతుందని తుడా చైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కాన్‌క్లేవ్-2.0 పేరుతో అతి పెద్ద వ్యాపార, పారిశ్రామిక వేత్తల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాలర్ దివాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వెయ్యికి పైగా బిజినెస్ సంస్థలను ఒక చోటకి చేర్చి బిజినెస్ ఐడియాలజీలను ఇతర కంపెనీలతో పంచుకునే విధంగా బీఎన్ఐ కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఏటా ఇలాంటి సమ్మేళనం ద్వారా వ్యాపార వేత్తలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. స్వలాభాపేక్ష లేకుండా వ్యాపారాభివృద్ధే లక్ష్యంగా బీఎన్ఐ చేపడుతున్నఇలాంటి కార్యక్రమాలను వ్యాపార, పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్ అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బీఎన్ఐ తిరుపతి రీజియన్ చైర్మన్ మణి సందీప్, కో- చైర్మన్ టెంకాయల దుర్గా ప్రసాద్, కన్వీనర్ యుగంధర్,స్పాన్సర్‌కో-ఆర్డినేటర్‌వంశీకృష్ణారెడ్డి, సాయి కిరణ్, స్వాతి, బీఎన్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చర్మ వ్యాధులపై కార్యశాలకు స్పందన

తిరుపతి హెల్త్, జూలై 20 ప్రభాతవార్త :



ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రిలో ఆదివారం చర్మ వ్యాధులపై జరిగిన కార్యశాల కు వైద్య విద్యార్థులకు స్పందన లభించింది. ఈ సందర్భంగా సంచాలకులు డాక్టర్ రవి ప్రభు, డెర్మటాల జీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు, ప్రముఖ చర్మ వైద్య నిపుణులు డాక్టర్ యుగంధర్ చర్మ వ్యాధి సంబంధ శస్త్ర చికిత్సలలో వచ్చిన నూతన విధానాలను పీజీ వైద్య విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ల బృందం, వైద్య విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## టీడీపీ నేత పెరుమాళ్ మధుపై దాడి

తిరుపతి హెల్త్, జూలై 20 ప్రభాతవార్త :



ఇచ్చిన డబ్బును అడిగినందుకు టీడీపీ నేత పెరుమాళ్ మధుపై దాడి జరిగిన సంఘటన ఆదివారం తిరుపతిలో చోటు చేసుకుంది. బాధితుడు మధు, భార్య విజయలక్ష్మి, స్నేహితులు తెలిపిన సమాచారం మేరకు...కొర్లగుంటలో కాపురం ఉంటున్న మధు తన సొంత అక్క సుగుణ, బావ రమేష్‌కు వారి అవసరాల నిమిత్తం రూ.30లక్షలు 2023లో ఇచ్చాడు.ప్రస్తుతం మధుకు తన అవసరాల నిమిత్తం అక్క, బావను ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వాలని ఒక సంవత్సరం నుంచి అడుతున్నాడు. అయితే అతని అక్క, భావ సరైన సమాధానం చెప్పడం లేదు. చివరికి మధు, అతని భార్య విజయలక్ష్మి స్కూటర్‌పై వెళుతుండగా ఆపి మధుపై అక్క,బావ దాడికి దిగి రాయితో తల వెనుక భాగాన కొట్టడంతో మధు స్పృహ తప్పి పడిపోయాడు.బాధితుడు మధును భార్య విజయలక్ష్మి, స్నేహితులు రుయాకు చేర్చారు. ప్రస్తుతం రుయాలో మధు చికిత్స పొందుతున్నాడు. ఇదే విధంగా పలు దఫాలు మధుపై అతని అక్క, బావ దాడులకు దిగుతున్నారని ఆస్పత్రిలో బాధితుడు కన్నీరు పెట్టారు. దీనిపై తనకు పోలీసులు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే మధునే రూ.30లక్షలు ఇవ్వాలని మధు అక్క, భావ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం ఈస్ట్ పోలీస్టేషన్‌కు మధు రావాలని పోలీసులు సమాచారం ఇవ్వడంతో మధు, తన భార్యతో కలిసి స్టేషన్‌కు వచ్చాడు. అక్క, బావతో మాట్లాడి తిరుగు ప్రయాణమైన నేపథ్యంలో మధుపై వారు దాడికి తెగబడినట్లు బాధితుడు మధు మీడియా ముందు వాపోయాడు.

## టివి సీరియల్ దర్శకులు మృతి

శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త



ప్రముఖ సీరియల్ దర్శకులు అన్వర్ మృతి చెందారు.ఆయనకు అభిమానులు తుడి వీడ్కోలు పలికారు.ఆదివారం మధ్యాహ్నం నమాజు సమయంలో ఆయన మృతదేహానికి నమాజు చదివించారు. శ్రీకాళహస్తికి చెందిన అన్వర్ తన విద్యాభ్యాసాన్ని వడమాల పేటలో సాగించారు.అందుకే ఆయన తన పేరును వడమాల అన్వర్‌గా మలచుకున్నారు. కొన్ని ప్రసిద్ది చెందిన చానల్స్ 'నాపేరు మీనాక్షి, కుంకుమ పువ్వు' వంటి సీరియల్స్‌ను అన్వర్ అందించారు. ఆయనమృతికి సంబంధించి పట్టణ ప్రముఖులు నివాళులర్పించారు.

# మధ్యంతర భృతి మంజూరు చేయాలి:పాతబకాయిలు చెల్లించాలి

## ఎపిటిఎఫ్ సమావేశంలో డిమాండ్

తొట్టంబేడు,జూలై 20 ప్రభాతవార్త




ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆది వారం జరిగిన ఎపిటిఎఫ్ కార్యవర్గ సమావేశంలో తిరుపతి జిల్లా శాఖ అధ్యక్షులు బి.మురళీకృష్ణ డిమాండ్ చేసారు. ఎపిటిఎఫ్ తిరు పతి జిల్లా శాఖ సమావేశం శ్రీకాళహస్తిలోని మున్సిపల్ బాబు అగ్రహారం ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షు డు బి.మురళీకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 12వ వేతన సవరణ అమలుకు ప్రత్యేక కమిషన్‌ను నియమిం చాలని మధ్యంతర భృతిని వెంటనే మంజూరు చేయాలని పెండింగ్ లో ఉన్న కరువు భత్యం పాతబకాయిల వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. 2023 జూలై నుంచి ఉద్యోగులకు వేతన సవరణ జరగాల్సి ఉందన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తు న్నా పట్టించుకోలేదన్నారు.జిల్లా కార్యదర్శి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసిన 2003కు ముందు నియామకం పొందిన వారికి కేంద్రం విడుదల చేసిన మెమో నెంబర్ 57ను అమలు చేసి పాత పెన్షన్ అమలు చేయాల్సిందిగా కోరారు. ఎపిటిఎఫ్ ఆడిట్ కమిటి సభ్యులకే వెంకటాద్రి మాట్లాడుతూ బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు ఇంకనూ పొజిషన్ ఐడిలు లేక జీతాలు అందలేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఈ మోహన్ దాస్ మాట్లాడుతూ ప్రభుత్వం అసంబద్ధ విధానాల వలన పాఠశాల మూతపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రభుత్వం వెంటనే ప్రయోగాలు మాని పాత పద్ధతితో పాఠశాలలో నిర్వహించాలని కోరారు. పూర్వ కమిటి ఆడిట్ కమిటి కన్వీనర్ జి.సుధాకర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఉద్యమాల బాటే సరైన మార్గమని ప్రభుత్వానికి తెలియజేసేలా ఎపిటిఎఫ్ ముందు స్తుగా ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని పిలుపు నిచ్చారు. జిల్లా బాధ్యులు ఆర్ గోపాల్, చంద్రశేఖర్, హేమ కుమార్, సుబ్రమణ్యం రాజు, హరి,ఏ వెంకటేశ్వ ర్‌రెడ్డి, మున స్వామిచెంచురాజు,రామసుబ్బయ్య,గోపినాద్, భువనేశ్వరి, వై. జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత మెకానిక్ కుటుంబాలకు రూ. 30వేలు ఆర్థిక సాయం

తిరుపతి కలెక్టరేట్, జూలై 20 ప్రభాతవార్త :



ముగ్గురు బాధిత టువీలర్స్ మెకానిక్స్‌కు తిరుపతి టువీ లర్స్ మెకానిక్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఆది వారం రూ.30వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆవుల మునిరెడ్డి తెలిపారు. తిరుపతికి చెందిన గోపాల్ (హార్ట్), చంద్రగిరికి చెందిన చిన్న తంబి (కిడ్నీ), తలకోనకు చెందిన సుబ్రమణ్యం (కాలు విరిగి) సమస్యలతో బాధపడుతున్న ఈ ముగ్గురికి ఒక్కొక్కరికి రూ. 10వేలు చొప్పన మునిరెడ్డి తన తోటి నేతలు, సభ్యులతో కలిసి అందజేశారు. అలాగే 70 మంది మెకానిక్స్‌కు స్పెషల్ టూల్ కిట్స్‌ను అందజేశారు. బోస్‌డీ ఎస్ 7 కంపెనీ ఏరియా మేనేజర్ సతీష్ చంద్రతో త్వరలో ఆ కంపెనీ నూతన బైక్‌ను గురించి మెకానిక్స్‌కు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మణరావు, సెక్రటరీ గురు ఆచారి, జాయింట్ సెక్రటరీ తేజారెడ్డి, ట్రెజరర్ బాబు, కమిటి మెంబర్లు నాగరాజు, పాపయ్య, మురుగ, బాధిత మెకానిక్స్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కాళంగి బ్రిడ్జికి మంచిరోజులు

## - సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వినతి


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట, జులై 20 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరి దేవస్థానం సమీపంలో కాళంగి నదిపై శిథిలావస్థలో ఉన్న వంతెనకు మంచిరోజులు వచ్చే అవకాశాలు మెరుగయ్యాయి. కొన్నేళ్లుగా ఈ వంతెనను నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధమైనప్పటికీ ఆ ప్రతిపాదనలు కేవలం కంటితుడుపు చర్యగా మాత్రమే మిగిలిపోయాయి. గత ప్రభుత్వం హయాంలో ఈ వంతెన నిర్మాణం చేపట్టాలని జీఓ జారీ అయినప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అప్పటి నుంచి ఈ బ్రిడ్జి ఎప్పుడు కూలిపోతుందా అనే భయాందోళనలు పట్టణ ప్రజల్లో నెలకొన్నాయి. ఈ బ్రిడ్జి కూలిపోతే పట్టణంలోకి రాకపోకలు పూర్తిగా స్తంభించే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రజల వినతులను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 19న తిరుపతి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి అత్యంత ప్రాధాన్యత గల ఈ బ్రిడ్జి పునర్నిర్మాణం విషయపై వినతి చేస్తూ గత ప్రభుత్వం హయాంలో విడుదల చేసిన జీఓ కాపీలను చూపించారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, ఇందుకు తగ్గట్టుగా సంబంధిత అధికారుల బృందంతో ప్రతిపాదనలు సిద్ధం చేయించిన అనంతరం ప్రత్యామ్నాయ చర్యలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఎమ్మెల్యే విజయశ్రీకి హామీ ఇచ్చారు. దీంతో బ్రిడ్జికి మంచిరోజులొచ్చే అవకాశాలు మెరుగయ్యాయి.

# గూడూరు డివిజన్

## కన్నులపండువగా శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

సూళ్లూరుపేట, జులై 20 ప్రభాతవార్త



ఆడికృతిక పర్వదినాన్ని పురస్కరించుకుని సూళ్లూరుపేటలోని శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆదివారం దేవస్థానం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఈ కార్యక్రమాన్ని భక్తుల సమక్షంలో జరిపారు. ఎఎంసి మాజీ ఛైర్మన్ పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కవిత దంప తులు ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ దంపతుల సౌజన్యంతో దేవస్థానానికి శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యస్వామి పంచలోహ ఉత్సవ విగ్రహాలు అందజేశారు. వేదపండితులు మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకుతోట రమేష్, సుబ్రహ్మణ్యంనాయుడు, ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, టి.ఆదినారాయణరెడ్డి, రాజశేఖర్, సాయి, ఆనందనాయుడు, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదాం

## ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ

గూడూరు, జూలై 20, ప్రభాతవార్త

ఏఐటియుసి గూడూరు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం గూడూరు ఏఐటీయూసీ కార్యాలయంలో నారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గంలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చ జరిగింది. వారు మాట్లాడుతూ ప్రధానంగా మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని అందుకోసం ఆగస్టు 7 నుండి ఏఐటియుసి అనుబంధ మునిసిపల్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని పేర్కొన్నారు. గూడూరు మున్సిపల్ కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఆశ, అంగన్వాడి మధ్యాహ్న భోజనం స్కీం కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు స్కీమ్ కార్మికులందరికీ వర్తించే విధంగా ప్రభుత్వం అమలుచేయాలన్నారు. అందరికీ కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొన్న స్కీం కార్మికులను చూసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బుద్ధి తెచ్చుకోవాలని తెలిపారు. ఈనెల 27న గూడూరు పట్టణంలో ఏఐటియుసి నియోజకవర్గ ప్లీనరీ సమావేశం నిర్వహించి నిర్మాణ ఏర్పాట్లు చేసుకుని పోరాట కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని సమావేశం తీర్మానించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గంలో పెద్ద ఎత్తున చర్చ జరిపి చైతన్యపరిచి పోరాటాలలోకి తీసుకురావాలని, అన్ని కార్మిక సంఘాల జనరల్ బాడీ సమావేశాలు జరపాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి



శశి కుమార్, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్, ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాముండేశ్వరి, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సి.వి.ఆర్ కుమార్, ప్రసన్న, పెంచలమ్మ, జరీనా, యాకుబ్, రాఘవులు గోపి, తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించిన మంత్రి

నాయుడుపేట జూలై 20 ప్రభాతవార్త;



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడు తున్న సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాయుడు పేటకు విచ్చేసిన మంత్రి గుమ్మడి సంధ్య రాణి ముందుగా ఎన్టిఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ ఆనాడు తెలుగువారి ఆత్మగౌరవం కాపాడేందుకు ఎన్టిఆర్ 1982లో తెలుగుదేశంపార్టీని స్థాపించారని తెలియజేశారు.రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలను అభివృద్ధి చేయాలని కెజిబియ్యం రెండు రూపాయలకే ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కేంద్రమాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీఎంపి నెలవల సుబ్రమణ్యం,జిల్లాఅధ్యక్షుడు నరసింహ యాదవ్,తదితరులు ఉన్నారు.

## కోట మండల టిడిపి ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వరరావు

కోట, జులై 20 ప్రభాతవార్త



కోట మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరుమలశెట్టి కోటేశ్వరరావును నియమించారు. కోటేశ్వరరావు తెలుగుదేశం పార్టీ కోట పట్టణ అధ్యక్షుడిగా 1999-2004 మధ్య కాలంలో రెండుసార్లు పనిచేశారు. 2021లో కోట మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా, 2022లో గూడూరు నియోజకవర్గ అధికార ప్రతినిధిగా సేవలు అందించారు. ప్రస్తుతం కోట మండల ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా తిరుమలశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ గత 27 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో వివిధ పదవుల్లో పనిచేశానని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు, మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు జలీల్ అహ్మద్‌కి, జిల్లా రైతు విభాగం కార్యదర్శి నెల్లూరు మోహన్‌రెడ్డికి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థిచదువులకు ఆర్థిక సాయం



చిల్లకూరు, జూలై 20, ప్రభాతవార్త

చేడిమల గ్రామానికి చెందిన బండి హరి కూతురు బండి వరలక్ష్మి తిక్కవరం హై స్కూల్ నందు పదవ తరగతిలో 550 మార్కులతో స్కూల్ ఫస్ట్ వచ్చినందుకు ఆమె పై చదువులు చదువుకొనుటకు ఆర్థిక స్తోమత లేనందున ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు కోఫౌండర్ శిరీషలను సంప్రదించగా వెంటనే స్పందించి ఆమె కాలేజీ ఫీజుకు అవసరమైన 50 వేల రూపాయలను ట్రస్ట్ అధ్యక్షులు పిచ్చయ్య నాయుడు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి రామానాయుడు చంద్రశేఖర్‌నాయుడు, దాసినేని శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

## 6వ టీచర్స్ క్రికెట్ లీగ్ సన్నాహక సమావేశం

గూడూరు, జూలై 20, ప్రభాతవార్త



ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న టీచర్స్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ 2025 సన్నాహక సమావేశం కుమ్మరి వీధిలోని ప్రగతి సేవాసంస్థ ఆఫీస్‌లో నిర్వహించారు. ఈ సమావేశం ప్రగతి సేవా సంస్థ, అధ్య క్షులు కడివేటి చంద్రశేఖర్, పలు జట్ల ప్రతిని ధుల ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. ఈ సమావేశంలో టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించినటువంటి పలు అంశాలను చర్చించి, నిర్ణయాలను తెలుపడమైనది. టోర్నమెంట్ నిర్వహణ తేదీలు 31.08.2025 నుండి 02.09.2025(3 రోజులు) వరకు పాల్గొను జట్లు ఈ నెల ఆదివారం లోపు తమ ఎంట్రీలను తెలియ చేయాలన్నారు. టోర్నమెంటును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టోర్నమెంట్ నిర్వాహక కార్యదర్శి పిడి కరీముల్లా, మురళి సింగ్, బాబర్, రఫీ, బాలాజీ రాజు, చెంచుకృష్ణ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ

గూడూరు, జూలై 20, ప్రభాతవార్త



గూడూరు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కుడుముల వెంకటనారాయణ దాతృత్వంలో భారత్ పెట్రోల్ బంకులో దివ్యాంగులకు కూరగాయలు గుడ్లు పంపిణి చేశారు. జే.వి.వి. ఉపాధ్యక్షులు చెంచునారాయణ మాట్లాడుతూ ప్రతి నెల మూడవ ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు గుడ్లు పంపిణి చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. కుడుముల నారాయణ మా జే.వి.వికి అన్ని విధాలా సహకారం ఇస్తున్నారన్నారు. వారి మనుమరాలు జులైలో పుట్టినందున ఈ నెల దాతృత్వం వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవివి ప్రతినిధులు చెంచునారాయణ, నాగరాజు, పురుషోత్తమరావు, సుమన్ రెడ్డి, రాదయ్య, శ్రీనివాసాచారి, అరుణ్ కుమార్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి : ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, జూలై 20, ప్రభాతవార్త



సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజల్లోకి పార్టీ నాయకులు కార్యకర్తలు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఎస్ఎల్ఆర్ కళ్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంవత్సరం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. నియోజకవర్గం రాష్ట్రంలోని సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ముందు ఉంచాలని తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు జన్ని రమణయ్య మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో నిర్వహణలో వెనకడుగులో ఉందని చెప్పారు. పార్టీ నాయకులు కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు కార్యకర్తల సూచనలు సలహాలు ఇచ్చారు. సమావేశంలో డి సి ఎం ఎస్ చైర్మన్ జి నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు గంగాధర్, పప్పు చంద్రమౌళి రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారాలు మానుకోవాలి : ఎమ్మెల్యే పాశం

గూడూరు, జూలై 20, ప్రభాతవార్త



నా రాజకీయ జీవితం తెలుగుదేశం పార్టీలోనే మొదలయ్యిందని, వైసీపీలో ఉన్న వారి వ్యాపారాలను ఇబ్బంది పెట్టే సంస్కృతి నాకు లేదని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్ పై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు మహిళలను ఇబ్బంది పెడితే కేసులు పెట్టకుండా ఊరుకోవాలా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో పోలీసులను అడ్డుపెట్టుకొని తెలుగుదేశం పార్టీ వారిపై అనేక అసత్య ఆరోపణలు చేస్తూ కేసులు పెట్టి వేధించారని పేర్కొన్నారు తన రాజకీయ జీవితం తెలుగుదేశం పార్టీలో ప్రారంభమైందని ప్రస్తుతం తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నానని పేర్కొన్నారు. వైసిపి పాలనలో సిలికా, క్వార్జ్ యదేచ్చగా అక్రమం జరిగిందని పేర్కొన్నారు. తాను ప్రజల్లో ఉండటాన్ని చూసి ఓర్వలేక వైసిపి నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. గూడూరు పట్టణంలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి, పంబలేరు బ్రిడ్జి నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు గూడూరులో రౌడీయిజంను ప్రోత్సహించే పరిస్థితి లేదని తేల్చిచెప్పారు. గూడూరును తిరుపతిలో కలిపిన పాపం వైసీపీ వాళ్లదే అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెలబల్లి భాస్కర్ రెడ్డి, శీలం కిరణ్ కుమార్, వెంకటేశ్వర రాజు, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

## బిజేవైఎం నూతన కమిటీ నియామకం

చిల్లకూరు, జూలై 20, ప్రభాతవార్త



చిల్లకూరు మండల కమిటి సమావేశానికి ముఖ్యఅతిథి గా బిజెపి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు పనబాక కోటేశ్వరరావు ఈ సమావేశంలో చిల్లకూరు మండల అధ్యక్షులు విన్నమాల ప్రవీణ్ కృష్ణారెడ్డి, బిజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నుతన మండలం కమిటి నియమించారు. నూతన మండల ఉపాధ్యక్షురాలు కోటమ్మ, ఉపాధ్యక్షులు కన్నా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు అవినాష్, ఉపాధ్యక్షుడు పారిచర్ల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి పిల్లిల సాయి చందు, కార్యదర్శి డాక్టర్ బాబు,కార్యదర్శి కురుగొండ మస్తాన్, కార్యదర్శి కత్తి కేశవ, కార్యదర్శి గట్టు మురళీకృష్ణ, కోశాధికారి మంద పెంచెలయ్యలను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో గోను నాగర్జున, మేకల నాగరాజు, కోడి పోలయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఘనంగా వల్లి దేవసేన సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం

బాలాయపల్లి, జూలై 20, ప్రభాతవార్త



ఆడికృతిక పర్వదినం సందర్భంగా బాలాయపల్లి మండలం సుబ్రహ్మణ్యం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. ఆలయాన్ని, స్వామి అమ్మవార్లను పరిమళ పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర కళ్యాణం వైభవంగా జరిగింది. వేద పండితులు శాస్త్రోక్తంగా కళ్యాణాన్ని నిర్వహించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పొలంరెడ్డి కోటేశ్వర్ రెడ్డి, తెలుగు రైతు అధ్యక్షులు దుగ్గి వెంకటేశ్వర్లు కళ్యాణంలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం, తీర్థప్రసాదాలు అందజేశారు.

# హరోం హరా.. వేల్ మురుగా

## - కూసూరులో ఘనంగా ఆడికృత్తిక ఉత్సవాలు.. పోటెత్తిన భక్తులు



కుప్పం, జూలై 20 ప్రభాతవార్త

హరోం హరా ..వేల్ మురుగా నినాదా లతో కూసూరు అటవీ ప్రాంతంలోని శ్రీ బాలసుబ్రమణ్య స్వామి ఆలయ ప్రాంతం మార్మోగింది. ఆదివారం ఆడిక ృత్తిక సందర్భంగా మొక్కులు కలిగిన భక్తులు వివిధ రకాల కావడులు తీసుకువచ్చి స్వామివారి సన్నిధిలో కావడి మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలనుంచి సుమారు ముప్పై వేలమంది దాకా భక్తులు ఈ ఉత్సవాలకు హాజరయ్యారని అంచనా. పలువురు భక్తులు వీపుకు తేరు తగిలించుకుని లాగడం, పలువురు నోట్లో శూలాలు గుచ్చుకుని వచ్చి మొక్కులు చెల్లించారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఆలయ ప్రాంగణం భక్తులతో కిట కిటలాడింది. భక్తులకు పెద్ద ఎత్తున నిర్వాహకులు అన్నదానం చేపట్టారు. కుప్పం నుంచి ఆర్టీసీ బస్సులను ప్రత్యేక సర్వీసులు నడిపారు. ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ సభ్యులు డా॥ బిఆర్ సురేష్‌బాబు, డిఎస్పీ పార్ధసారథి, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ తదితరులు స్వామివారిని దర్శి ంచుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర, కమిటీ సభ్యులు చెక్కునత్తం మణి, కనకరాజు, సుందర్, నాగవేలు, గిరి

## పంట నమోదు తప్పనిసరి



పెళ్లకూరు జూలై 20 ప్రభాతవార్త :

మండలంలోని శిరసానంబేడు గ్రామంలో నాయుడుపేట వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఎం నాగార్జునసాగర్ రైతులకు పంట నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహిం చడం జరిగింది ఈ కార్యక్రమంలో రైతులును ఉద్దేశించి మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. దీనికోసం మీ పొలం పాస్ బుక్కు మరియు ఆధార్ కార్డు తో రైతు సేవా కేంద్రంలోని వ్యవ సాయ సహాయకుడుని కలిసి" పంట ""పంట నందు నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో విజయభారతి వి ఏ ఏ ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

## ఏఎంసి చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కు సన్మానం

పెళ్లకూరు జూలై 20 ప్రభాతవార్త :



కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నామినేటెడ్ పదవులు భర్తీ చేసింది అందులో భాగంగా నాయుడుపేట ఏఎంసీ చైర్మన్‌గా సూళ్లూరుపేట నియోజక వర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ఉయ్యాల ప్రవీణ్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పెళ్లకూరు మండల జనసేన నాయకుడు తాళ్ల రెడ్డి శ్రీనివాస్ మరియు జన సైనికులు ఆయనని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా న్యాయం చేస్తానని నాకు ఇచ్చిన బాధ్యతని తుచా తప్పకుండా నిర్వహిస్తానని తెలియజేసారు. సూళ్లూరుపేట నియోజకవర్గ శాసన సభ్యురాలు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అట్లా కృష్ణారావు, సతీష్,బాలుసెట్టి, కుంపట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## వాకాడు ఎంఎంసి చైర్మన్‌గా ప్రమీల



కోట, జులై 20 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీలో జెండాలు మోసిన వారికి అదృష్టం కలిసి రావడంతో ఆ పార్టీలో కీలక నామినేటెడ్ పదవులు అందుకుంటున్నా రు. ఇందుకు కోట బిట్-1 ఎంపిటిసి సభ్యులు దారా సురేష్ మూడు దశాబ్దాలకు పైగా రాజకీయ ప్రయాణం కొనసాగిస్తూ టిడిపి జెండా మోశారు. ఆ క్రమంలో నల్లపరెడ్ల ఆశీస్సులతో ఎంపిటిసి పదవి దక్కించుకున్నారు. ఆ నేపథ్యంలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు విధేయుడిగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరిస్తూ వచ్చారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవులను సీఎం చంద్రబాబునాయుడు భర్తీ చేయడంతో వాకాడు ఎఎంసి ఛైర్‌పర్స న్‌గా సురేష్ సతీమణి ప్రమీలకు అవకాశం వచ్చింది. ఇక్కడ సురేష్ పనితనంతో పాటు అదృష్టం కూడా కలిసి వచ్చిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి.

## శ్రీచెంగాళమాత సేవలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సూళ్లూరుపేట, జులై 20 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవిని రాష్ట్ర శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన మంత్రికి దేవస్థానం సహాయ కమిషనర్ బి.ప్రసన్న లక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దగ్గరుండి మంత్రికి వేదపండితుల మంత్రోచ్ఛరణలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఎజి కిషోర్, అలవల శ్రీనివాసరావు, పర్వతరెడ్డి చంద్రారెడ్డి, పి.మాధవనాయుడు, రాజశేఖర్, తహశీల్దార్ గోపీనాథరెడ్డి, సీఐ ఎం.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆడికృత్తిక పూజలు



వెంకటగిరి, జూలై 20, ప్రభాతవార్త

ఆడికృతిక సందర్భంగా వెంకటగిరి పట్టణంలోని షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. 365 కలిశాలతో పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సుబ్రహ్మ ణ్యస్వామి ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా పలు నృత్య ప్రదర్శనలు, రాక్షసుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సిఐ ఏవి రమణ పాల్గొని పూజలు నిర్వహించారు. నిర్వాహకులు గొల్లగుంట రాము, రమేషు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రాజశేఖర్ దీక్షితులకు " శైవాగమ రత్న " అవార్డు

చౌడేపల్లి, జూలై 20 ప్రభాతవార్త


అవార్డులందుకొంటున్న రాజశేఖర్‌దీక్షితులు

స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు డాక్టర్ రాజశేఖర్ దీక్షితులకు " శైవాగమ రత్న " అవార్డు లభించింది. శ్రీ సువర్ణ కర్ణాటక శైవాగమ మండలి బెంగళూరు వారిచే శ్రీకంఠ శివాచార్య గురుపూజ సందర్భంగా శైవాగములో ఉత్తీర్ణులైన ఆగమికులను సత్కరించారు. ఈక్రమంలో ఈ యేడాది డాక్టర్ స్థానీకం రాజశేఖర్‌దీక్షితులకు అవార్డు నందించారు. రాజశేఖర్‌దీక్షితులు దశాబ్దాలుగా ఆగమికులుగా పార్యంపర ధర్మాన్ని కొనసాగిస్తున్నారని గుర్తించారు. అంతేకాకుండా ఆయోజకులు కామికా ఆగ(శైవాగంలోభాగం)పుంగనూరు జమీందారీ ఆస్థానంలో ఆయన్ను మొదటి పండితులుగా వారి అన్వేషనలో తేలింది. దీంతో ఆయన్ను అవార్డు వరించింది. ఓకారహిల్స్ ఆశ్రమం శ్రీమధుసూదనందా పురి, మండలి అధ్యక్షుడు సోమసుందరదీక్షితులు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐపిఎస్ అధికారుల సమక్షంలో గవిపురం నందు డాక్టర్ స్థానీకం రాజశేఖర్‌దీక్షితులకు అవార్డునందించి సత్కరించారు. కాగా గతంలో ఆయనకు ఢిల్లీలో ఆతమశాస్త్రం తరపున "డాక్టరేట్" లభించింది. అవార్డుల పంటలను కురిపించుకొంటున్న ఆయన్ను స్థానికులు అభినందిస్తున్నారు.

## గణనాధుని సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి

కాణిపాకం, జూలై 20 ప్రభాతవార్త:

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్‌హరి ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ పెంచల కిషోర్,అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు వారి వెంట చిత్తూరు జిల్లా జడ్జి అరుణసారిక, ప్రోటోకాల్ జడ్జి శిరీష,ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీనాయుడు, రెవెన్యూ, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

